'అయ్యో! మరి రాంమోహన్!'

'లాహోరు రంగంలో పాటన్ టాంకు క్రింద నల్లిలాగా నలిగిపోయాడు.

వాళ్ళిద్దరూ ఏం మాట్లాడలేదు. మెహర్ తలవంచుకుంది. సింగ్‌పో అనంతంలోకి చూస్తున్నాడు.

'యువర్ అటెన్షన్ ప్లీజ్ యువర్ అటెన్షన్ బిఒఎసి ఎనౌన్సెస్ ఇట్స్ ఫ్లైట్‌టు కల్‌కటా **471**'

సింగ్‌పో నాచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు 'ఫర్‌గివ్ అజ్' వుయార్ ది డామ్‌డ్!' అని అన్నాడు.

'అల్‌విదా!' అని మెహర్ అన్నది.

'ఖుదా హాఫిజ్' అని అన్నాను.

విమానంలో పైలట్ దగ్గర మెట్టమొదటి సీటులో కూర్చున్నాను -

ఉద్దమ్‌సింగ్ ముఖంలో విషాదం కనిపించింది. నాకే షేక్‌హేండు యిస్తూ, 'ఆడియోస్ ఎమిగో !!' అని అన్నాడు.

నేను గుడ్ బై మై ఫ్రెండ్స్ ! అని అన్నాను.

విమానం భారతదేశం దిక్కుగా కదిలింది.

# సంధ్యవెలుగు

"రామం!" అంటూ సింహ గర్జనలాగా వినిపించింది. రామం ఉలిక్కిపడి వెనక్కు తిరిగాడు. చేతులో పువ్వుల పొట్లం క్రింద పడిపోయింది.

"అడుగు ముందుకు కదిలావంటె జాగ్రత్త!"

రామం అక్కడే నిలబడిపోయాడు.

"వెనక్కి తిరిగి వెళ్ళిపో. లేకపోతే ప్రాణాలు దక్కవు."

రామం యేం మాట్లాడలేదు.

మళ్ళీ చెబుతున్నాను వెళ్ళిపో.

రామం అక్కడనుంచి కదల్లేదు, క్రిందపడ్డ పువ్వులపొట్లం తీసుకున్నాడు. ఆయన రామం దగ్గరకు వచ్చాడు.

జాగ్రత్తగా విను. రామం వెళ్ళిపో! లేకపోతే ప్రాణాలతో తిరిగి వెళ్లవు.

ఈ పూలమాల....

ఆఖరిసారిగా యీ మాట చెబుతున్నాను. జాగ్రత్తగా విను. మా అమ్మాయి సమాధి దగ్గరకు మళ్ళీ వచ్చావా వూరుకోను...ఇప్పటికి జరిగిన అప్రతిష్ట చాలు. చచ్చిపోయినదాన్ని యింకా చంపకు నాయనా!

రామం ఒక్క అడుగు ముందుకు వేశాడు.

రామం! ఆ పువ్వులపొట్లం యిల్లా యియ్యి. ఆ పువ్వుల పొట్లం ఆయన చేతిలోకి రాగానే పువ్వు పువ్వు వెయ్యి ముక్కలయింది. నేల విరజిమ్మిన పువ్వులమీద విరిగిపోయిన మనస్సు కన్నీరు మున్నీరయింది.

వాడిన పువ్వులు మళ్ళీ వికసించవు రామం.

రామం యేం మాట్లాడలేదు.

నేను వెళ్లిన తరువాత మళ్లీ వద్దామని అనుకుంటున్నావేమో నేను ఎప్పుడూ నువ్వో నేనో మరణించేదాకా యిక్కడే కాపలా వుంటాను.

నేను ప్రమాణం చేసి చెబుతున్నాను. ఎప్పుడూ యిక్కడికి రాను. మీరు యింటికి వెళ్లిపొండి.

నువ్వు మళ్లీ యిక్కడికి వస్తే జానకి మీద ఒట్టు.

అంతమాట లనకండి. ఎన్నటికి యిక్కడికి రాను. వెళ్లిపోతున్నాను మీరు కుడా రండి.

ఆయనేం మాట్లాలేదు. మెల్లిగా రామం వెంట నడవటం మొదలు పెట్టాడు.

పగలు గడిచి రాత్రి వచ్చిందేమో స్మశానమంతా చిమ్మచీకట్లు చూస్తూవుండగానే కమ్ముకున్నాయి. దూరంగా వూళ్లో వెలిగిన దీపాలు తోరణాలలాగా కనిపిస్తున్నాయి.

దాదాపు అరమైలుదూరం యిద్దరూ నిశ్శబ్దంగా నడిచారు. ఇద్దరి దారులు వేరైయ్యే చోటు వచ్చింది. ఆయన ఆగి చీకటిలోకి చూస్తూ...

"రామం" అని అన్నాడు. రామం ఆయనవంక నిశ్శబ్దంగా చూశాడు.

నా చిట్టితల్లి బ్రతుకులో నిప్పులు పోసిన నిన్ను నిలువునా కాల్చి వెయ్యాలనిపిస్తుంది. దాని గుండెల్లో గునపాలు గుచ్చిన నిన్ను కండకండలుగా చీల్చి కాకులకు గద్దలకు వెయ్యాలనిపిస్తుంది. ఇరవై ఏళ్ళకే దాని బ్రతుకు తెల్లవారేట్టు చేసిన నువ్వు వురికంబం మీద వేళ్ళాడుతూ వుంటే చూసి హాయిగా నిశ్చింతగా కన్ను మూయాలనిపిస్తుంది.

కాని నిన్ను ఎందుకు చంపలేదో తెలుసా?

నా చిన్న తల్లి కలలో కనిపించి నన్ను వద్దని బ్రతిమాలింది. పగవాడిమీదనా జాలి అని అడిగాను.

నీ సిగ పువ్వు వాడకుండా నిన్ను వదిలిపెట్టమంది. నేనుకాదంటే కన్నీరు పెట్టుకుంది.

నా కన్న తల్లి కన్నీరు పెట్టుకుంటే నేను సహించలేనుగా రామం అందుకని నిన్ను బ్రతకనిచ్చింది.

ఐనా నువ్వు మాత్రం ఎలా సుఖపడతావులే. బ్రతికుండగానే వెయ్యిచావులు చస్తావు!

వెళ్లిపో నీ పాడుముఖం నాకు చూపించకు-అంటూ వడివడిగా ఆయన అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

రామం మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది.

జానకి! జానకి! అని మనస్సు ఎలుగెత్తి ఆక్రోశించింది.

ఎటుచూసిన నిరాశ! నిశ్శబ్దం.!

రామం యింటికి చేరేసరికి గుమ్మంలోనే తండ్రి కనిపించాడు.

"ఎక్కడికి వెళ్ళావు?" అని అడిగాడు.

స్మశానానికి.

దేనికి?

ఈ రోజు నిండు పున్నమి.

రామం !

అవును నాన్నా.

కథలలోని మనుష్యులలాగా మనం ప్రవర్తిస్తే ఎవరూ జాలిపడరు రామం. సరికదా పైగా హేళనకూడా చేస్తారు.

ఎందుకని?

వెళ్లు రామం ! లోపలికి వెళ్లు.... నా మనస్సు యింకా నొప్పించకు.

రామం పరాసరి లోపలికి వెళ్ళి తులసి కోట దగ్గర కూర్చున్నాడు.

"నాయనా రామం !" అంటూ ఒక మెల్లటి కంఠం పలికింది. కన్నెత్తి అటువంక చూశాడు.

అమ్మ నిలబడి వుంది.

రామం ఏదో చెబుదామనుకున్నాడు. కంఠం గద్గదమయింది.

అమ్మా !

ఏం నాయనా?

జానకి కోసమని పువ్వులు తీసుకుని వెళ్ళానమ్మా, వాళ్ళనాన్నగారు వాటిని నేలపాలు చేశారమ్మా.

ఆయన ఎక్కడ కనిపించారు?

జానకి సమాధి దగ్గర.... జానకిని నేను పువ్వుల్లో పెట్టి పూజించుకోవడం తప్పా అమ్మా?

ఆ అదృష్టం మన ఎవ్వరికీ లేదు నాయినా

ఒక్క మాట అడగనా అమ్మా?

చెప్పు నాయనా

నావల్లనే కదమ్మా జానకి చనిపోయింది ....

చూడు నాయనా రామం .... నాన్న గారు పెద్ద వారై పోయారు. ఆయనకు కూడా మనశ్శాంతి అవుసరం.

నేనేం చేస్తున్నానమ్మా?

నిన్ను బాధ పెట్టుకుంటున్నావు

అది నా స్వంత విషయం

అని అనుకుంటున్నావు కాని యిది మన అందరికి సంబంధించిన విషయం రామం.

నన్నేం చెయ్యమంటావమ్మా

మమ్మల్ని చిత్రవధ చెయ్యటం మానేయి.

నేను మిమ్మల్ని చిత్రవధ చేస్తున్నానా, అనుక్షణం మధన పడిపోతున్నానే

అందుకేదైనా మార్గం ఆలోచించావా?

ఆలోచించే స్థోమతగాని స్థిమితంగాని నాకు లేదమ్మా

ఎదురు దెబ్బతగిలిందికదా అని నడవటం మానేస్తామా రామం?

అమ్మా! ఏం చెయ్యబంటావమ్మా?

మగవాడిలాగా బ్రతకడం నేర్చుకో

ఎలా?

కావలసినంత డబ్బు తీసుకొని ఇక్కడ నుంచి దూరంగా వెళ్ళిపో. చాలా దూరంగా వెళ్ళిపో. మమ్మల్నందరిని మరిచిపో నాయనా

ఎందుకని?

జరిగిపోయిన పొరబాట్లని అనుక్షణం గుర్తుచేసుకోవడం ఎవ్వరికీ ఇష్టం వుండదు రామం.

"సరేనమ్మా" అంటూ రామం సరాసరి వాళ్ళనాన్నవున్న గదిలోకి వచ్చాడు.

గదిలో ఇనప్పెట్టె తెరిచి వుంది. ఎక్కడా రవ్వంత కూడా సందు లేకుండా కిందనుంచి పైదాకా బంగారం, నోట్ల కట్టలు వున్నాయి నాన్నగారు రామాన్ని చూడగానే

"ఇదంతా యివ్వాళనుంచి నీదే రామం. నీ కోసం నీవాళ్ళకోసం ..."

"నేనూ నావాళ్ళ ఏనాడో మరణించాం. మరణించినవాళ్ళకు సిరులెందుకు సంపదలెందుకు" అంటూ రామం వెనక్కి తిరిగాడు.

'భోజనం చేద్దువుగాని దా రామం' అని అమ్మ పిలిచింది.

రామం ఏం మాట్లాడకుండా కంచం దగ్గర కూర్చున్నాడు.

ప్రక్క గదిలోనుంచి గాజుల చప్పుడు వినిపించింది. రామం ఉలిక్కిపడ్డాడు.

"శ్యామల వచ్చింది రామం" అని అమ్మ పలికింది.

"ఎందుకు వచ్చింది?" అని రామం అడిగాడు.

ఇల్లంతా పిడుగు పడ్డంత నిశ్శబ్దం.

అమ్మ ఏం సమాధానం చెప్పలేదు.

అన్నం తినకుండా రామం కంచం దగ్గరనుంచి లేచిపోయాడు. అమ్మకంఠం గద్గదమయింది. ఏదో చెప్పబోయింది. కాని ప్రక్కగదిలోని స్త్రీ కంఠం వెక్కి వెక్కి ఏడుస్తోంది.

రాత్రి పదిదాటింది. పున్నమి వెన్నెల. వసారాలో కూర్చొని చందమామ వంక చూస్తున్న రామానికి

"బావా!" అని ఒక మెత్తటి కంఠం వినిపించింది.

రామం మాట్లాడలేదు. అటు తిరిగి చూడలేదు.

"బావా!" అని ఆ కంఠం మళ్ళీ పలికింది. ఒక చల్లటి చెయ్యి అతని భుజం మీద పడ్డది.

కూర్చో శ్యామలా !

శ్యామల అతని పాదాల దగ్గర కూర్చుంది.

క్షమించమని అడగడానికి కూడా నాకు అర్హత లేదు బావా

ఇప్పుడు ఆ అవసరం ఏం లేదు శ్యామలా.

కాని నా వల్ల ఒక నిండు ప్రాణి బలి అయిపోయిందంటే నా మనస్సుకు శాంతి కలగటంలేదు.

నీ వల్లనే జరిగిందని ఎందుకనుకోవాలి శ్యామలా?.

"నేను వుండబట్టేగా అత్తయ్య మామయ్య అంతా జానకికి వ్యతిరేకంగా ప్రవర్తించింది. నా వల్లనేగా వాళ్ళంతా కలసి ఒక అమాయకురాలిని చిత్రవధ చేసి, అది ఆత్మ హత్య అని లోకాన్ని మోసం చేసింది."

అని నువ్వనుకుంటున్నావు శ్యామలా

ఈ మాట అబద్ధమంటావా బావా?

నాలాంటి శాపగ్రస్తుడిని ప్రేమించింది కాబట్టే జానకి నాశనమై పోయింది. ఎవ్వరిని ఎదిరించలేని పిరికి వాడిని కనుకనే జానకి జీవితం ధ్వంసమయింది. అంతేకాని దీంట్లో మీ ఎవ్వరి దోషం లేదు.

బావా !

జానికిని నేను గాఢంగా ప్రేమించాను. నా సర్వస్వం ఆ పిల్లేనని సంతోషపడ్డాను. కాని ఆ పిల్లకోసం పోట్లాడి ఆ మనిషిని బ్రతికించుకోగల శక్తి, ధైర్యం నాకు లేకపోయాయి.

అన్ని పనులు మన యిష్టప్రకారం జరగవు బావా.

అదే మన మనస్సుని బాధించే విషయం.

నా ప్రార్థన వింటావా బావా?

ఏమిటి శ్యామలా?

నువ్వు జానకిని ప్రేమించావు. అది తప్పు అని నేను అనటంలేదు. రాముడికి జానకి మీద ప్రేమ కలగటంలో ఏం ఆశ్చర్యం లేదు. మీ యిద్దరిది జన్మ జన్మల ప్రేమ. కాని మనవాళ్ళకు యింకా యీ అజ్ఞానం పోలేదు.

నీ వల్లనే తన కుమార్తె జీవితం పాడయిందని, ఆ పిల్ల నూరేళ్ళ బ్రతుకూ యింతలోనే తెల్లవారిందని శ్యామలా వాళ్ళనాన్న ఉద్దేశ్యం. ఆయన దృష్టిలో జానకి ఆత్మహత్య చేసుకోలేదు. దారుణంగా హత్యచేయబడింది.

కాదు శ్యామలా

నువ్వు తమ మాటవిని పరాయికులం పిల్లని విడిచి పెట్టాలని అత్తయ్యకు మామయ్యకు మనస్సులో వుంది. జానకి ఆత్మహత్య చేసుకుంటుందని వాళ్ళు ఎన్నడూ అనుకోలేదు.

నిన్ను చూచినప్పుడల్లా వాళ్ళ మనస్సులో మసలే మాట నీద్వారా వాళ్లు చేసిన ఘెరపాపం. నువ్వు ధర్మం అనుకున్న దాని కోసం నిలబడి పోట్లాడలేని పిరికి వాడివి అనే బాధ వాళ్ళను అనుక్షణం చిత్రవధ చేస్తున్నాయి.

అన్నింటికంటే కూడా నువ్వు చేస్తున్నపని. ఎంతో గాఢంగా ప్రేమిస్తున్న జానకిని ఆత్మశాంతి లేకుండా చెయ్యడం.

నేను జానకికి ఆత్మశాంతి లేకుండా జేస్తున్నానా?

తన సమాధిని నిత్యం పూలతో పూజించే ప్రియుడిని వదిలి ఆవిడ ఆత్మ

స్వర్గానికి వెళ్ళగలదా? ఆత్మహత్య చేసుకున్న మహాపాపం నుంచి విముక్తి పొంది స్వర్గానికి ఎలా చేరుకుంటుంది !

శ్యామలా? !

నువ్వు నిజంగా జానకిని ప్రేమిస్తే ఆమె నిమిత్తంగా అందరిని ద్వేషించఢం మానేయి. ఏ కారణం వల్లనో మీ యిద్దరూ యీ జన్మలో యిలా కలుసుకున్నారు. ఇంకే కారణం వల్లనో మీ ప్రేమలు ఫలించలేదు. దానికి నువ్వే బాధ్యుడవని అనుకోవడం ఎంత పొరబాటు. నిన్ను క్షోభ పెట్టుకుని యితరులని క్షోభ పెట్టడం మానేయి.

నీ మాటలు నమ్మాలనిపిస్తోంది శ్యామలా.

నమ్ము బావా. ఈ మాట కూడా తప్పకుండా నమ్ము.

ఏమిటది?

నిన్ను నా వాడిని చేసుకోవడానికి యీ మాటలన్నీ చెబుతున్నానని అనుకోవద్దు. ఎక్కడో అక్కడ నువ్వు సుఖంగా వుండటం కన్నా నాకు కావలసిందేదీ లేదు. ఇది నీ పాదాల సాక్షిగానే చెబుతున్న మాట.

నిన్ను ఇంతకాలం ఎంత అపార్థం చేసుకున్నాను శ్యామలా?

అపార్థమా !

నువ్వు పల్లెటూరి దానివని, చదువూ సంధ్యారాని దానివని యింతకాలం పొరబాటు పడ్డాను. నీలో యింత విజ్ఞానం, సహనం వుందని నాకు తెలియదు.

శ్యామల ఏం మాట్లాడలేదు. రామం చేతిని తన చేతిలోకి తీసుకుని

"సుఖంగా వుండుబావ" అని అంటూంటే కంఠం గద్గదమయింది.

మరునాడు ఉదయం అంతా నిద్దర లేచేసరికి రామం యింట్లోలేడు. ఒక చిన్న ఉత్తరం మాత్రం కనిపించింది.

నన్ను గురించి మీరు బాధ పడవద్దు. ఆత్మహత్య చేసుకోగల ధైర్యం నాకు లేదని మీకు తెలుసు.

మంచి సంబంధం చూసి నా డబ్బుతో శ్యామలకు పెళ్ళి చెయ్యండి.

-రామం.